## అన్నా ప్లీజ్.. హెల్మెట్ ధరించండి..



2





2

## నెలరోజులుగా తాగునీరు బంద్..



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


### మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**అక్షరటుడే, కోటగిరి:** మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కుమ్మరి నరేందర్ అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో ఆరేళ్ల నుంచి మట్టి గణపతిని తయారు చేసి విక్రయిస్తున్నారు. మట్టి గణపతి తయారు చేయడం ద్వారా, పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని తెలిపారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా రసాయనాలతో తయారు చేసే వినాయక ప్రతిమలను వాడకంతో జల కాలుష్యం పెరిగిపోయి పర్యావరణం దెబ్బతింటుందని దానికి బదులుగా మట్టి విగ్రహాలను వాడుదామని అన్నారు.



# బల్దియాలో ఏం జరుగుతోంది..?



- అభివృద్ధిపై పట్టింపు లేని నాయకులు
- ప్రతి సమావేశంలో వాయిదాల పర్వం
- రేపటి సమావేశంపై ఉత్కంఠ

వివాదాలు, ఆందోళనలకు కామారెడ్డి బల్దియా వేదికగా మారుతోంది. నూతన పాలకవర్గం ఏర్పాటైన నాటి నుంచి బల్దియాను వివాదాలు వీడటం లేదు. పట్టణ అభివృద్ధిపై జరగాల్సిన ప్రతి సమావేశం రసాభాసగా మారి వాయిదా పర్వానికి చేరుతోంది. ఫలితంగా ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయి. పట్టణ అభివృద్ధి కుంటు పడుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో బల్దియాలో త్రిముఖ పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తో కుదిరిన ఒప్పందంతో అధికార పార్టీ చైర్మన్ పీఠం దక్కించుకోగా, బీజేపీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. బయటకు మిత్రులుగా కనిపిస్తున్నా లోపల మాత్రం మూడు పార్టీలు మూడు దారుల్లో నడుస్తున్నాయి. ఒక్కొక్క పార్టీ ఒక్కో విధానంతో వెళ్తుండటంతో బల్దియా మూడు ముక్కలాటగా మారింది. ఒక్కో పార్టీ తన బలం చూపుకునేందుకు కౌన్సిల్ సమావేశాన్నే వేదికగా మార్చుకుంటోంది.

### అభివృద్ధిపై పట్టింపు లేని నాయకులు

రాజకీయ ఆధిపత్య పోరులో పట్టణ అభివృద్ధి పూర్తిగా మరుగున పడిపోయింది. రోడ్లు గుంతలమయం, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నా, పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే నాథుడే లేడు. తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రజల నిత్యావసర సమస్యలపై చర్చ జరగడం లేదు. కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన నాయకులు తమ వర్గ ప్రయోజనాలు, కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపుల చుట్టూనే తిరుగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### రేపటి సమావేశంపై ఉత్కంఠ..

శనివారం జరగబోయే కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. అధికారులు మరోసారి ధైర్యం చేసి 9 కీలక అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. స్వచ్ఛభారత్ నిధులతో మిషనరీ కొనుగోలు, మురుగు దొడ్ల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్సీ నిధులతో స్వచ్ఛ ఆటోలు, ఈవీ ఆటోలు, డోజర్ల కొనుగోలు, 49 వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి యూజర్ చార్జీల వసూలు, నాన్ వెజ్ వ్యర్థాల సేకరణకు ప్రత్యేక టెండర్లు, భారీ వర్షాల సమయంలో చేపట్టిన అత్యవసర జేసీబీ పనుల బిల్లుల చెల్లింపు, వినాయక చవితి ఉత్సవాలు, పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లకు నిధులు, వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహణ వంటి ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి.

### ఆందోళనతో వాయిదాల పర్వం

బల్దియాలో జరిగే ప్రతి కౌన్సిల్ సమావేశం గందరగోళంతోనే ప్రారంభమవుతోంది. ఎజెండా అంశాలను చదివి వినిపించేలోపే నినాదాలు, ఆందోళనలు, వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యులు మైకులు లాక్కోవడం, పేపర్లు చించేయడం, చైర్‌పర్సన్ కుర్చీని చుట్టుముట్టడం పరిపాటిగా మారింది. అధికారులు నిబంధనలు చెప్పినా వినే పరిస్థితి లేదు. చివరకు చైర్‌పర్సన్ సమావేశాన్ని మధ్యలోనే వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బల్దియా సమావేశం అంటేనే హైడ్రామా అన్నట్లుగా తయారైంది.

### మూడు సమావేశాలు వాయిదా

నూతన పాలకవర్గం కొలువుదీరిన తర్వాత ఇప్పటివరకు జరిగిన మూడు కౌన్సిల్ సమావేశాలు కూడా ఎలాంటి తీర్మానాలు ఆమోదించకుండానే వాయిదా పడ్డాయి. ఒక్క అంశంపై కూడా కౌన్సిల్ ఆమోద ముద్ర పడలేదు. కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నా, కొనుగోళ్లు, పారిశుధ్య పనులన్నీ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. అభివృద్ధి ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమవుతున్నాయి.

### చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లతో కొత్తలొల్లి

తాజా ఎజెండాలోనే అసలు ట్విస్ట్ ఉంది. ఇప్పటివరకు మున్సిపాలిటీనే ఉచితంగా చేస్తున్న చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి, ప్రజల నుంచి నెలనెలా యూజర్ చార్జీలు వసూలు చేయాలన్న ప్రతిపాదనను అధికారులు తెరపైకి తెచ్చారు. ఈ ప్రతిపాదన ఇప్పుడు కౌన్సిల్‌లో కొత్త లొల్లికి కారణమవుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం మోపితే తీవ్ర వ్యతిరేకత వస్తుందని పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రేపటి సమావేశంలో ఈ అంశంపై దుమారం రేగే అవకాశం ఉంది.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం గుర్తించిన స్థలాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. పట్టణ శివారులోని బోర్లం రోడ్డు సమీపంలో కల్కి చెరువు పక్కన ఉన్న స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, జిల్లా సమగ్ర అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థల విస్తీర్ణం, భవన నిర్మాణానికి అనుకూలత, రహదారి కనెక్టివిటీ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. స్థల పరిశీలన అనంతరం భవన నిర్మాణానికి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## యువకవి సింగీతం సంతోష్ కుమార్‌కు 'రాఖీ తేజం' బిరుదు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'రాఖీ పౌర్ణమి' అంశంపై కవితల పోటీలో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన యువకవి సింగీతం సంతోష్ కుమార్ ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఆయనకు ఆన్‌లైన్ ద్వారా 'రాఖీ తేజం' బిరుదుతో ప్రశంసాపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, కవులు, కళాకారులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## విద్యార్థుల దుస్తుల తయారీ పనుల్లో నాణ్యత పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల దుస్తుల కుట్టు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం దత్తు, వెంకటరెడ్డి కలిసి శుక్రవారం సందర్శించారు. కొత్తగా తయారు చేస్తున్న దుస్తుల నాణ్యత, కుట్టు పనితీరు, కొలతలు, ఫినిషింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల దుస్తుల కుట్టు పనిలో కొలతలు, కుట్టు నాణ్యత, ఫినిషింగ్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు అందించడం ద్వారా మరింత మంచి గుర్తింపు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ అకౌంటెంట్ రాజు, సీఏర్పీ రాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.




## ఆత్మీయత, అనురాగానికి ప్రతీక.. రాఖీ పండుగ



**రాఖీ పండుగ తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలను ఇనుమడింపజేసే ఈ పండుగను ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించుకున్నారు.** – అక్షరటుడే, బాన్సువాడ


– మిగతా ఫొటోలు 2వ పేజీలో..


## మార్కండేయ మందిరంలో వైభవంగా జంధ్యాల పౌర్ణమి



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని జంధ్యాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తులు సామూహికంగా జంధ్యాలు మార్చుకున్నారు. పాత జంధ్యాలను తొలగించి, ఆచార ప్రకారం నూతన జంధ్యాలను ధరించి మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, పట్టణ అధ్యక్షుడు క్యాతం కృష్ణ, ఉపాధ్యక్షుడు సామల రాజు, ప్రధాన కార్యదర్శి సామల విజయ్, కోశాధికారి తాటిపాముల శివకుమార్, సలహాదారులు సంతోష్, ప్రభు, నారాయణ, శ్రీహరి, శ్రీనివాస్, గంగ కిషన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి అభివృద్ధిపై కేసీఆర్‌కు సైతం బాధ్యత ఉంది




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేశారని.. ఆయనకు ఇక్కడి ప్రజల సమస్యలపై, పట్టణ అభివృద్ధిపై బాధ్యత ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ గురువారం వరదలపై చేపట్టిన నిరసన సందర్భంగా ఆయన మాట్లాడిన వ్యాఖ్యలు, పిండ ప్రదనాన్ని కాంగ్రెస్ నాయకులు తప్పుపట్టారు. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్లో రూ.1,400 కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.100 కోట్లు తీసుకొచ్చి కామారెడ్డి అభివృద్ధికి కృషి చేయాలని సవాల్ విసిరారు. గత రెండున్నరేళ్లలో గంప గోవర్ధన్ ఏనాడూ ప్రజల పక్షాన మాట్లాడింది లేదని, ప్రభుత్వ పథకాలపై స్పందించిన దాఖలాలు లేవని విమర్శించారు.

### షబ్బీర్ అలీ సాయం

గతేడాది వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తమ నాయకుడు షబ్బీర్ అలీ స్పందించి సహాయ సహకారాలు అందించాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్సీలను చివరికి సీఎంను కూడా కామారెడ్డికి రప్పించారని తెలిపారు. సీఎం వచ్చి వెళ్లాక ప్రభుత్వం సత్వర పనుల కోసం రూ.10 కోట్లు మంజూరు చేసిందని, వరద నష్టంపై షబ్బీర్ అలీ సీఎంకు వివరించి నిధులు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

సీఆర్ఆర్ ఫండ్స్ కింద రూ.50 కోట్ల ప్రతిపాదనలు పంపితే రూ.25 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఎఫ్‌డీఆర్ కింద రూ.16 కోట్లు, యూఐడీఎఫ్ కింద రూ.18.70 కోట్లు వచ్చాయని వెల్లడించారు. వరద నీరు సజావుగా వెళ్లేందుకు రూ.8.80 కోట్లతో స్ట్రాం కాలువల నిర్మాణానికి నిర్ణయించామని, టెండర్ కూడా పూర్తయిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టలేని పనులను తమ నాయకుడు చేపిస్తున్నారన్నారు. సీఎంపై, తమ నాయకులపై మాజీ ఎమ్మెల్యే అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. తమ ప్రభుత్వ హయాంలో కామారెడ్డి అభివృద్ధి చెందిందని చెబుతున్నారని, అదే నిజమైతే వాళ్ళ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను కామారెడ్డి ప్రజలు ఎందుకు ఓడించారో సమాధానం చెప్పాలని నాయకులు సవాల్ విసిరారు. ఐరేని సందీప్, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, కన్నయ్య, గణేష్, కౌన్సిలర్ అంజాద్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం



**అక్షరటుడే, బాన్సువాడ :** పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తూ డాక్టర్ సంతోష్ రెడ్డి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. నస్రుల్లాబాద్ మండలం నెమలి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు బండి కావేరి, చిట్టి మానస హైదరాబాద్‌లోని దోమలగూడ ప్రభుత్వ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో యూజీడీపీఈడీ రెండేళ్ల కోర్సు చదివేందుకు రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో డాక్టర్ సంతోష్ రెడ్డి ఈ సహాయాన్ని అందించడం పట్ల విద్యార్థులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటునందించిన డాక్టర్ సంతోష్ రెడ్డికి క్రీడాకారుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



## ఎల్లారెడ్డిలో ఘనంగా జంధ్యాల పౌర్ణమి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పట్టణ పద్మశాలి అధ్యక్షుడు విద్య రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ పద్మశాలి సంఘ భవనంలో వైదిక పురోహితులు దయానందం, హన్మాండ్లు, నాగరాజు గౌడ్, సంతోషిని ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించి గాయత్రి (జంజరాలు) ధరించారు. అనంతరం మహిళా కమిటీ అధ్యక్షురాలు నామ విజయ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి తమ్మల లాస్య ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తులకు రాఖీలు కట్టారు. పట్టణ పద్మశాలి అధ్యక్షుడు విద్య రవికుమార్, ప్రధాన కార్యదర్శి పద్మ కాశీరాం, కోశాధికారి గూడ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు షేర్ల సోమేశ్వర్, తమ్మల శ్యాంసుందర్, ఎల్లారెడ్డి మండల పద్మశాలి అధ్యక్షుడు పద్మ పండరి, ప్రధాన కార్యదర్శి షేర్ల ప్రభు, పట్టణ కార్యవర్గం పద్మ బాలకిషన్, తాటిశెట్టి శ్రీనివాస్, నాగుల యాదగిరి, గుజ్జరి శంకర్, మూడ దుర్గయ్య, గుజ్జరి లక్ష్మీనారాయణ, కొంక ఆంజనేయులు, గోష్కే బాలకిషన్, సామల వెంకటేశం, కోల్చమ్మ చందు, పాండి పెద్దమనుషులు దేవసాని పోశెట్టి, షేర్ల ప్రభువులు, గూడ రామకృష్ణ, చెన్న విశ్వనాథం పాల్గొన్నారు.

## షాపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, నందిపేట్:** మండలంలోని షాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎర్రం హన్మాండ్లు అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరడి రాములు, వార్డ్ మెంబర్ అమందు వంశీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నార్ల నర్సయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు నార్ల రంజిత్, ఉప్పరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయత అనురాగానికి ప్రతీక.. రాఖీ పండుగ



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి దొడ్ల సత్యవతి



ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు రాఖీ కడుతున్న బాలికలు



సీఎంకు రాఖీ కడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ



గణేష్ బిగాల, మహేష్ బిగాలకు రాఖీ కట్టిన సోదరీమణులు..



సోదరుడు రాజుకు రాఖీ కడుతున్న మాజీ మేయర్ ఆకుల సుజాత



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు రాఖీ కడుతున్న మహిళలు



సిబ్బందికి రాఖీ కడుతున్న మోపాల్ ఎస్‌హెచ్‌వో సుష్మిత

## అన్నా ప్లీజ్.. హెల్మెట్ ధరించండి.. రాఖీ కట్టి పోలీసుల వినూత్న కార్యక్రమం

**అక్షరటుడే, కామారెడ్డి:** రాఖీ పండుగ సందర్భాన్ని రోడ్డు భద్రతా అవగాహనకు వేదికగా మలుచుకుని కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జరిమానాలతో భయపెట్టడం కంటే ఆత్మీయతతో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ గౌడ్ నేతృత్వంలో పోలీస్ స్టేషన్ ఎదుట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన ద్విచక్ర వాహనదారులను ఆపి, మహిళా ట్రాఫిక్ సిబ్బంది వారికి బొట్టు పెట్టి రాఖీ కట్టారు. 'అన్నా ప్లీజ్.. మీ ప్రాణం మీ కుటుంబానికి ఎంతో విలువైనది, క్షేమంగా ఇంటికి చేరడం కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి' అంటూ సూచించారు. చట్ట ప్రకారం చలానా విధిస్తూనే, మానవతా దృక్పథంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన తీరు వాహనదారులను ఆకట్టుకుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్ సాగర్‌తో పాటు మహిళా సిబ్బంది శోభ, స్వప్న, అనిత, సిబ్బంది మూసిన్ ఖాన్, తిరుపతి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టుమిషన్ పథకం దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. నిరుద్యోగ బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నారు. అందుకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో తాహెరా బేగం సూచించారు. బీసీ మహిళలు మాత్రమే అర్హులని.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలన్నారు. 18 నుండి 45ఏళ్ల మధ్య ఉన్నవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 15వ తేది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఆసక్తి గల అర్హులైన మహిళలు తమ సమీప మీసేవా కేంద్రాల్లో లేదా సంబంధిత మండల కార్యాలయంలో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.



## నెలరోజులుగా తాగునీరు బంద్.. కాలనీవాసుల ధర్నా

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండల కేంద్రంలోని పోచారం కాలనీలో గత నెలరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. నెల రోజులుగా తాగునీరు అందకపోవడంతో తీవ్రఅవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తీసుకురావాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించి, కాలనీలో క్రమం తప్పకుండా తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు. ధర్నాలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, పోచంపాడ్:** మెండోరా మండలం పోచంపాడ్ గ్రామపంచాయతీ జీపీవో చిన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ మాధురి, ఉప సర్పంచ్ సంపంగి సతీష్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, చందు, అజ్జు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



## అరుదైన పిల్లిజాతి జంతువు మృతి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** అడవుల్లో అరుదుగా కనిపించే పిల్లిజాతి జంతువు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన సిరికొండ రేంజ్ పరిధిలోని హుస్సేన్ నగర్ బీట్ కంపార్ట్‌మెంట్ వద్ద చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారులు తెలిపిన ప్రకారం.. ఆర్మూర్ అటవీ డివిజన్ పరిధిలోని, సిరికొండ రేంజ్‌లో హుస్సేన్ నగర్ బీట్ కంపార్ట్‌మెంట్ నం.408లో రోడ్డు పక్కన బొడ్డు మామిడి చెరువు ప్రాంతంలో ఒక పిల్లి జాతి జంతువు మృతి చెందినదని సమాచారం అందింది. వెంటనే స్పందించిన అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అది రస్టీ స్పాటెడ్ క్యాట్ తుప్పు రంగు మచ్చల పిల్లి అని నిర్ధారించారు. ఈ జంతువు వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూలు 1కు చెందినదని.. చాలా అరుదైనదిగా వారు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నదానం

**అక్షరటుడే, నందిపేట్:** రాఖీ పౌర్ణమి సందర్భంగా నందిపేట్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలతో యజ్ఞం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు, కుటుంబ సభ్యులు, సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి. జంజరాలు ధరించుకొని ఒకరికొకరు రాఖీలు కట్టుకొని ఆత్మీయత చాటుకున్నారు. అనంతరం పద్మశాలి సంఘం భవనంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూడ వెంకటేష్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు చందన్ గంగాధర్ పాల్గొన్నారు.

## మిత్రుడి జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు

**అక్షరటుడే, గాంధారి:** మిత్రుడు అకస్మాత్తుగా మరణించడంతో అతని జ్ఞాపకాలు స్మరించుకుంటూ యూత్ ఆధ్వర్యంలో రాఖీ పండుగ రోజు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాంధారి మండలంలోని దుర్గం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తబాదితండాకు చెందిన లకావత్ రామ్ మృతి చెందాడు. దీంతో అతడి జ్ఞాపకార్థం సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో పోటీల్లో 32 మంది మహిళలు పాల్గొనగా ముగ్గురికి ట్రోఫీతో పాటు సన్మానించినట్లు యూత్ సభ్యులు వెల్లడించారు.



